## క్లుప్తంగా

### అంగన్‌వాడీ కేంద్రంలో గణతంత్ర వేడుకలు


తాటిపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో గణతంత్ర వేడుకలు

**పిఠాపురం:** గొల్లప్రోలు మండలం తాటిపర్తి అంగన్‌వాడీ సెంటర్లో గురువారం చిన్నారులతో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. చిన్నారుల నడుమ అంగన్‌వాడీ సిబ్బంది జాతీయ జెండాను ఎగురవేశారు. చిన్నారులతో ఆటలు, పాటలు పాడించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఘనంగా చండీహోమాలు


కాండ్రకోటలో నిర్వహిస్తున్న చండీహోమం

**పెద్దాపురం:** కోరిన కోర్కెలు తీర్చే పెద్దాపురం మరిడమ్మ, మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ ఆలయాల్లో పౌర్ణమి సందర్భంగా గురువారం చండీహోమాలను ఘనంగా నిర్వహించారు. మరిడమ్మ ఆలయ ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో వేదపండితులు హోమాన్ని నిర్వహించారు. కాండ్రకోట నూకాలమ్మ దేవస్థానం చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో హోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించగా రెండు ఆలయాల్లోనూ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

**కొత్తపల్లి:** సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు స్థానిక పోలీసులు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... తొండంగి మండలం కొత్తపాకలు గ్రామానికి చెందిన బత్తుల నారాయణ పొన్నాడ శివారు కోనపాపపేట వైపు సారా తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై స్వామి నాయుడు తన సిబ్బందితో దాడి చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### కుంగిపోయిన డ్రైన్


ఉప్పాడ మల్టీ పర్పస్ భవనం వద్ద కుంగిపోయిన డ్రైన్

**కొత్తపల్లి:** మండలంలోని ఉప్పాడ మల్టీపర్పస్ భవనం సమీపంలో డ్రైన్ కుంగిపోయింది. డ్రైన్ నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతో ఒకవైపు ముక్కలుగా విడిపోయింది. మురుగు నీరు పోయేందుకు మార్గం లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైన్ కుంగిపోవడంతో మురుగునీరు ఇళ్లమధ్య నిలిచిపోయి దోమలు పెరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైన్‌ను పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

### పలువురికి దవులూరి పరామర్శ

**సామర్లకోట:** పట్టణ పరిధిలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు గురువారం సాయంత్రం పరామర్శించారు. స్థానిక సత్య నారాయణపురంలో ఇటీవల మృతి చెందిన సింగంపల్లి మణికంఠ కుటుంబ సభ్యులను, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అడబాల కుమారస్వామి సోదరి ప్రభావతి ఇటీవల మృతి చెందడంతో కుమార స్వామి కుటుంబ సభ్యులను దొరబాబు పరామర్శించి సానుభూతి, సంతాపం తెలిపారు. పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణాలపై దాడులు


గోకవరం మండలంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

**గోకవరం:** మండలంలోని పలు ప్రైవేటు, సొసైటీ కార్యాలయాల్లో ఎరువుల దుకాణాలపై వ్యవసాయశాఖ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏఓ రాజేశ్వరి మండలంలోని 14 ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించి స్టాకు నిల్వల్లో హెచ్చుతగ్గులు ఉన్న సుమారు రూ.33 వేలు విలువ గల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఎరువులు నిల్వల్లో తేడాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణ మాణిక్యాలకు అవకాశం

- ఆడుదాం ఆంధ్రాలో పోటీ పడుతున్న యువత
- ఉత్సాహంగా నియోజకవర్గ స్థాయి పోటీలు
- ఉత్తమ జట్లు జిల్లా స్థాయికి ఎంపిక

**సామర్లకోట:** గ్రామీణ స్థాయిలో క్రీడలపై ఆసక్తి ఉన్న వారికి 'ఆడుదాం ఆంధ్ర' సువర్ణ అవకాశం కల్పించింది. 15 ఏళ్లు నిండిన క్రీడాకారులకు ఈ పోటీల్లో అవకాశం దక్కింది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు మంచి అవకాశాలు కల్పించేలా జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయి సెలక్షన్ కమిటీ సభ్యులను ఆహ్వానించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు గ్రామీణ స్థాయి పోటీలు ముగిసి నియోజకవర్గ స్థాయి పోటీలకు క్రీడాకారులు సన్నద్ధమయ్యారు. నియోజకవర్గ పరిధిలో సామర్లకోట అర్బన్, రూరల్, పెద్దాపురం అర్బన్, రూరల్ జట్లు తలబడుతున్నాయి. దీనిలో భాగంగా కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతున్నాయి. నియోజకవర్గ స్థాయి క్రీడా వేదికైన పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో ఒక పండగ వాతావరణం ఏర్పడింది. ఈ పోటీలకు రెండు మున్సిపాలిటీలు, రెండు మండలాలకు చెందిన పీడీలు, పీఈటీలు అంపైర్లుగా వ్యవహరిస్తున్నారు. రెండు మున్సిపాలిటీల కమిషనర్లు, ఎంపీడీఓలు, పెద్దాపురం ఆర్డీఓలు ఈ పోటీలను పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గ వాలీబాల్ పోటీల్లో గురువారం పెద్దాపురం రూరల్ జట్టు విజయం సాధించింది.


నియోజకవర్గ స్థాయిలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

**బహుమతులు ఇవే..**

నియోజకవర్గ స్థాయిలో ప్రథమ విజేతకు రూ.35 వేలు, ద్వితీయ విజేతకు రూ.15 వేలు, తృతీయ విజేతకు రూ.ఐదు వేలు నగదు బహుమతి అందజేస్తున్నారు. షటిల్ బ్యాడ్మింటన్ ప్రథమ విజేతకు రూ.20 వేలు, ద్వితీయ విజేతకు రూ.10 వేలు, తృతీయ విజేతకు రూ.ఐదు వేలు నగదు బహుమతులు ఉండడంతో ఆటల పోటీలు ఆసక్తికరంగా మారాయి. జిల్లా స్థాయిలో కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో విజేతలకు ప్రథమ రూ.60 వేలు, ద్వితీయ రూ.30 వేలు, తృతీయ రూ.10 వేలు షటిల్ బ్యాడ్మింటన్ విజేతకు ప్రథమ రూ.35 వేలు, ద్వితీయ రూ.20 వేలు, తృతీయ రూ.10 వేలు ఇవ్వనున్నారు. ఇక రాష్ట్ర స్థాయి కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో విజేతకు ప్రథమ రూ.ఐదు లక్షలు, రూ.మూడు లక్షలు, తృతీయ రూ.రెండు లక్షలు, షటిల్‌కు ప్రథమ రూ.రెండు లక్షలు, ద్వితీయ రూ.లక్ష, తృతీయ రూ.50వేలు నగదు బహుమతులుగా అందజేయనున్నారు.

**ప్రోత్సాహికులకు అవకాశం**



ఆడుదాం ఆంధ్ర పోటీలు ఆటలు ఆడాలనుకునే వారికి మంచి వేదిక నిలుస్తోంది. వాలీబాల్‌పై ఎంతో ఆసక్తి ఉంది. అయితే ఆడే అవకాశం కనిపించలేదు. నియోజకవర్గ స్థాయిలో విజయం సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. జిల్లా స్థాయిలో కూడా విజయం సాధిస్తాం. ఏటా ఇటువంటి పోటీలు ఏర్పాటు చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులకు మంచి అవకాశం లభిస్తుంది.

– వై.రాంబాబు, తాటిపర్తి, వాలీబాల్ విజేత జట్టు ప్రతినిధి, పెద్దాపురం మండలం

**క్రీడాకారులకు గుర్తింపు**



కబడ్డీ, ఖోఖోలో రాష్ట్ర స్థాయిలో మంచి క్రీడాకారులు సామర్లకోటలో ఉన్నారు. ప్రస్తుతం వారు క్రీడా కోటాలో ఉద్యోగాలు చేస్తున్నారు. క్రమేపీ క్రీడాకారులు తగ్గిపోతున్నారు. ఇటువంటి తరుణంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రలో రాష్ట్ర వ్యాప్తంగా పోటీలు నిర్వహించడం ద్వారా ఆయా క్రీడల్లో క్రీడాకారులకు గుర్తింపు లభిస్తుంది. రాష్ట్రంలో క్రీడాకారుల సంఖ్య పెరుగుతుంది.

– యార్లగడ్డ బంగార్రాజు, పీడీ, జి.మేడపాడు, సామర్లకోట మండలం

### 29న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**పెద్దాపురం:** పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగ తాయారు అధ్యక్షతన ఉంటుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఆయా మున్సిపల్ విభాగాల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

### జిల్లా ఉత్తమ పురస్కారానికి ఏఎన్ఎం ఎంపిక


ఎస్.దైవకృప

**సామర్లకోట:** స్థానిక 11వ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం ఎస్.దైవకృప రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా స్థాయి పురస్కారానికి ఎంపికైంది. ఈ మేరకు జిల్లా వైద్యాధికారి నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి అమల తెలిపారు. దైవకృప కరోనా సమయంలో, ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ప్రతి ఆరోగ్య శిబిరాల్లోను ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంతో ఆమె సేవలను గుర్తించి వైద్యాధికారులు ఈ పురస్కారానికి సిఫార్సు చేశారు. ఈ మేరకు శుక్రవారం కాకినాడలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమక్షంలో కలెక్టర్ ద్వారా ఆమె అవార్డు అందుకోనున్నారు.

# 50 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు

**వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ దవులూరి**


బ్రహ్మానందపురం సభలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

**సామర్లకోట:** పేదలకు ఇళ్ల స్థలాలు అందజేయడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు సృష్టించారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. రెండో విడత ఇళ్ల స్థలాల కేటాయింపులో భాగంగా నవర గ్రామంలోని 200 మంది లబ్ధిదారులకు గురువారం బ్రహ్మానందపురం లే అవుట్‌లో ప్లాట్లను చూపే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి రికార్డు సృష్టించారన్నారు. సామర్లకోట ఈటీసీ లే అవుట్ 55 ఎకరాలల్లో 2,444 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా 1500 ఇళ్ల నిర్మాణం పూర్తి అయిందన్నారు. బ్రహ్మానందపురం లే అవుట్ 50 ఎకరాల్లో ఐదు గ్రామాల్లో 502 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. రెండో విడతలో ఇళ్ల నిర్మాణం ప్రారంభమవుతోందన్నారు. పట్టాలు తీసుకున్న వారికి రెవెన్యూ అధికారులు ప్లాట్లను చూపిస్తున్నట్టు తెలిపారు. లబ్ధిదారుడు ఇంటి పట్టాను రిజిస్టర్ చేసుకునేలా సచివాలయంలోనే ఏర్పాట్లు చేశామని, దాంతో బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు పొందవచ్చని ఆయన తెలిపారు. ఎమ్మెల్యేలకు టిక్కెట్లు కేటాయింపులో భాగంగా మొదటి టిక్కెట్టు నాకే ఇచ్చారని, నియోజకవర్గం నుంచి స్థానికునిగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డి రెండో పర్యాయం ముఖ్యమంత్రి కావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దాంతో నవర గ్రామానికి చెందిన మహిళలు ఫ్యాను గుర్తుకే ఓట్లు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీనివాసు, గ్రామ సర్పంచ్ దమ్మాల లక్ష్మణరావు, ఎంపీటీసీ కేశవరపు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, మాజీ సర్పంచ్ సిద్దు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### బుడబుక్కల సంఘ సంక్షేమానికి కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

**సామర్లకోట:** బీసీ, ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మాధవపట్నంలో బుడబుక్కల కుల సంక్షేమ సంఘం పదో వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న దొరబాబు సంఘ కమ్యూనిటీ భవన నిర్మాణంతో పాటు కాలనీకి రూ.50 లక్షలతో వంతెన నిర్మాణానికి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సంఘ నాయకుడు వాస్తేరు చినసుబ్బారావు అధ్యక్షత వహించగా సంఘ నాయకులు సువార్తరాజు, హుస్సేన్, చిన్నా, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి మేడిశెట్టి బుజ్జి, సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ పాల్గొన్నారు.

# వైభవంగా పాదగయ క్షేత్ర ప్రదక్షిణ


పాదగయలో క్షేత్ర ప్రదక్షిణ నిర్వహిస్తున్న భక్తులు

**పిఠాపురం:** పట్టణంలో గురువారం పాదగయ క్షేత్ర ప్రదక్షిణ కన్నులపండువగా జరిగింది. పతంజలి యోగా సమితి ఆధర్యంలో ఉదయం 6 గంటలకు పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేసి మేళతాళాల నడుమ ప్రదక్షిణ ప్రారంభించారు. పాదగయ క్షేత్రం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామివారికి పూజలు నిర్వహించారు. తొలిసారిగా ఆలయ ప్రదక్షిణ ఏర్పాటు చేసినప్పటికీ భక్తుల నుంచి మంచి స్పందన వచ్చినట్టు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరావు తెలిపారు. గిరిప్రదక్షిణ మాదిరిగా ఆలయ ప్రదక్షిణ నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో పతంజలి యోగా సమితి యోగా శిక్షక్ ఎస్.శ్రీనివాస్, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, పాలక మండలి సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

# ఓటుహక్కే వజ్రాయుధం

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- సీనియర్ల ఓటర్లకు సత్కారం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు

**పిఠాపురం:** ప్రజాస్వామ్యంలో ఓటుహక్కే వజ్రాయుధమని, ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి సూచించారు. స్థానిక ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ కళాశాల క్రీడా మైదానంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. జడ్జి మాధవి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఓటుహక్కు వినియోగంతోనే సమాజాన్ని మెరుగుపర్చుకోవచ్చన్నారు. దేశభవిష్యత్ ఓటర్లపైనే ఆధారపడి ఉందన్నారు. పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపల్ కమిషనర్లు పీఎస్ఎస్ కృష్ణవేణి, సత్యనారాయణ ఓటుహక్కు ఆవశ్యకతను వివరించారు. సీనియర్ ఓటర్లను శాలువా, పూలమాలతో సత్కరించారు. కొత్తగా ఓటుహక్కు పొందిన యువకులకు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. అనంతరం ఓటుహక్కు ఆవశ్యకతను వివరిస్తు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పిఠాపురం, కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయాల్లో తహసీల్దార్లు త్రినాథరావు, ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఓటుహక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు.


పిఠాపురంలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న అధికారులు


పిఠాపురం సభలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మాధవి

**ఓటు హక్కుతో ప్రజాస్వామ్య పరిరక్షణ**

**పెద్దాపురం:** 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి ఓటు హక్కు నమోదయ్యేలా చూడాలని, తద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందని ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ వజ్రపు జితేంద్ర అధ్యక్షతన జరిగిన ఓటరు దినోత్సవ సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి యువకుడు ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. జిల్లాలోనే ఓటు నమోదు ప్రక్రియలో నియోజకవర్గం ముందంజలో ఉండడం అభినందనీయమన్నారు. శాఖల సమన్వయంతోనే ఓటు నమోదు ప్రక్రియలో 95 శాతం ముందంజలో ఉన్నామన్నారు. నమోదు ఫారం 6 ప్రకారం మీ సేవలో కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుంచి మున్సిపల్ సెంటర్ మెయిన్‌రోడ్డు, మరిడమ్మ గుడి వీధి, ఆర్టీసి కాంప్లెక్స్ ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్లను ఆర్డీఓ రామారావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ కమిషనర్లు జంపా సురేంద్ర, రామారావు, కార్యాలయ ఏఓ వెంకటలక్ష్మి, డీటీలు భానుకుమార్, కాంతారావు, వార్డు సచివాలయాల సిబ్బంది, వార్డు వలంటీర్లు, ఆర్పీలు, మహారాణి కళాశాల, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.


సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

**బచ్చు ఫౌండేషన్ హైస్కూల్‌లో..**

**సామర్లకోట:** 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుపై ప్రతి ఒక్కరికి అవగాహన పెరగాలన్నారు. ఉపాధ్యాయులు, వార్డులోని విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. బీఎల్‌ఓలు భరత్, ఎం.మాధవి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. కౌన్సిలర్ గుబ్బల సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఓటుహక్కుపై అవగాహన ర్యాలీలు**

**కొత్తపల్లి:** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గ్రామ సచివాలయాల వద్ద సీనియర్ ఓటర్లను శాలువా, పూలమాలతో వేసి సత్కరించారు. ఓటర్లతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు


ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న చేయిస్తున్న ఆర్డీఓ రామారావు

### వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం


రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

**అన్నవరం:** పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు యనమండ్ర శర్మ, కోట వంశీ, చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 49 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

### బెల్ట్ షాపులపై పోలీసుల దాడి

**జగ్గంపేట:** మండలంలోని గుర్రంపాలెంలో బెల్ట్ షాపులపై జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు గురువారం తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడుల్లో గండికోట సత్యనారాయణకు చెందిన షాపులో 43, గండికోట వీరరాఘవులుకు చెందిన షాపులో 30 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

**కోటనందూరు:** పేదలందరికీ సొంతిల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. కోటనందూరులో 88 మంది లబ్ధిదారులకు గురువారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను దగ్గర నుంచి చూసిన సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఎన్నికల వేళ టీడీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారం, మాయ మాటలు నమ్మొద్దన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ఊపిరిగా పాలన సాగిస్తున్న సీఎం జగన్, మంత్రి దాడిశెట్టి రాజాకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, లోవదేవస్థానం మాజీ చైర్మన్ ఉమారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఏఏబీ మండల చైర్మన్ సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గరిసింగు దొరబాబు, దార్ల సూర్యచంద్ర, కొరుప్రోలు కృష్ణ, మల్లంపల్లి ప్రకాష్, ఉల్లూరి శ్రీను, తోలెం విజయరాజు తదితరులు పాల్గొన్నారు


కోటనందూరులో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

### ముస్లిం పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బషీరుద్దీన్


మహమ్మద్ బషీరుద్దీన్

**ప్రత్తిపాడు:** ముస్లిం పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, కాకినాడ జిల్లా కన్వీనర్‌గా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన మహమ్మద్ బషీరుద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జియావుద్దీన్ నియామక ఉత్తర్వులు ఇచ్చారు. బషీరుద్దీన్‌ను స్థానిక ఎంపీపీ పాఠశాల కమిటీ చైర్మన్ కట్టమూరి కొండబాబు తదితరులు అభినందించారు.